# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 26-5-2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 317

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





2లో

## బెంగాల్లో ఇవిఎంకు బిజెపి ట్యాగ్

# డ్రగ్స్ అన్న మాట వినరావద్దు

## కఠిన చర్యలు తీసుకోవాల్సిందే

డ్రగ్స్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే యువతపై డ్రగ్స్, మత్తు పదార్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. నార్కోటిక్స్ బ్యూరోకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకబడ్జెట్ కేటాయించింది. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకే ఆదేశించారు.




2లో

### వర్షాకాలంలో ముందస్తు చర్యలకు సిద్ధం కావాలి

### కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించిన సిఎం రేవంత్

### డిజిపి, సిఎస్‌లతో పలు అంశాలపై సమీక్ష




2లో

# రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వేడి


### సోమవారం నాటి ఎన్నిక కోసం పోటాపోటీ ప్రచారం

### మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా ఉప ఎన్నిక

## బెంగళూరు రేవ్ పార్టీ కేసు

నటి హేమకు బెంగళూరు పోలీసుల నోటీసులు

సోమవారం విచారణకు హాజరు కావాలని ఆదేశాలు



2లో



2లో

## పదేళ్లలో బిఆర్ఎస్ ఉద్యోగాలు ఇవ్వలేదు

ఇస్తే నిరుద్యోగులు ఎందుకు ప్రశ్నిస్తారు

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో ఈటెల విమర్శలు

# జులై నుంచి రైతు భరోసా

హైదరాబాద్:శాసనసభ ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని.., వాటిని కచ్చితంగా అమలు చేసి తీరుతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వానాకాలం సీజన్ నుంచే పంట సాగు చేసేవారందరికీ 'రైతు భరోసా' అమలు చేయనున్నామని, జులైలో ఎకరానికి రూ.7500 చొప్పున పెట్టుబడి సాయం అందుతుందని చెప్పారు. రైతుల నుంచి అఫిడవిట్ తీసుకుంటేనే కౌలుదార్లకు భరోసా సాయం అందిస్తామన్నారు. పంద్రాగస్టులోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం ఖాయమని తెలిపారు. వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా బ్యాంకుల నుంచి చిన్న, సన్నకారు రైతులందరికీ రుణసహాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు



నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రం కొన్నా.. కొనకపోయినా రైతుల పంటలకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు చేపడతామన్నారు. పంట నష్టపోయిన సందర్భాల్లో రైతులను ఆదుకునేలా పంటల బీమాకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని.. ఈ వానాకాలం నుంచి అమలు చేస్తుందని పేర్కొన్నారు. శనివారం ఆయనగత 5 నెలలుగా రైతు సంక్షేమ పథకాల అమలుపైనే దృష్టి సారించామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రతీరోజు సమీక్షలు జరిపి ఎప్పటికప్పుడు ఆదేశాలిచ్చామని వెల్లడించారు. మద్దతు ధరతో ధాన్యం, పలు ఉత్పత్తుల కొనుగోళ్లు చేపట్టామని, వర్షాల వల్ల పంటలు నష్టపోయిన వారికి రెండు నెలల్లోపే సాయం అందించామని వివరాలివీ.. మీరు అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలో వ్యవసాయరంగం ఎలా ఉంది?మేం వచ్చేనాటికి వానాకాలం పంట ముగిసి యాసంగి మొదలైంది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీళ్లు లేవు. వర్షాకాలం పంటకు అప్పటి ప్రభుత్వం నీరివ్వలేదు. కొనుగోలుకు సైతం విద్యుత్ అందుబాటులో లేదు. కష్టమైనా సరే.. కరెంట్ కొనుగోలు చేసి పంటలు కాపాడాం. భూగర్భజలాలు అడుగంటిన చోట ఇబ్బంది ఏర్పడింది.

# రోజూ 90 శాతం విద్యార్థుల హాజరు తప్పనిసరి

ప్రతి నెలా 4వ శనివారం 'నో బ్యాగ్ డే'

జూన్ 1 నుంచి 11 వరకు బడిబాట

ఈ విద్యాసంవత్సరం మొత్తం పని రోజులు 229

పాఠశాల విద్య అకడమిక్ క్యాలెండరు విడుదల

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో రోజూ 90 శాతానికిపైగా విద్యార్థుల హాజరు ఉండాలని విద్యాశాఖను ఆదేశించింది.**

హైదరాబాద్:విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో రోజూ 90 శాతానికిపైగా విద్యార్థుల హాజరు ఉండాలని విద్యాశాఖను ఆదేశించింది. 'విద్యాహక్కు చట్టం-2009'.. తరగతులు, సబ్జెక్టుల వారీగా పిల్లలు నేర్చుకోవాల్సిన అంశాలను నిర్దేశించినందున లక్ష్య సాధనకు పిల్లలు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని పేర్కొంది. ప్రభుత్వంకొత్తవిద్యాసంవత్సరానికి(2024



-25) సంబంధించిన అకడమిక్ క్యాలెండరును విడుదల చేసి, మార్గదర్శకాలు వెలువరించింది. వాటిని అమలు చేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అధికారులను ఆదేశించారు. నిర్దేశిత విద్యా సామర్థ్యాల సాధనకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్.. ఇలా అన్ని రకాల పాఠశాలల్లో రోజూ 90 శాతానికిపైగా విద్యార్థులు హాజరవ్వాలని, అందుకు వారి తల్లిదండ్రులు, విద్యా కమిటీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రధానోపాధ్యాయులను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



2లో

## పదేళ్లలో 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

ఉమ్మడి ఎపితో పోలిస్తే తెలంగాణలోనే టాప్

పూర్తిగా స్థానికులకే ఉద్యోగావకాశాలు

ఉపాధి కల్పన రంగంలో ముందున్న తెలంగాణ

మీడియా సమావేశంలో కెటిఆర్ వివరణ



3లో

## తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండలు

ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదు

వర్షాలు తగ్గుముఖంతో మారిన వాతావరణం



# ఇసి వెబ్‌సైట్‌లో పోలింగ్ శాతం వివరాలు

**ఈసికి ఆదేవాలపై ఎడిఆర్ అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీం**

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల తొలి అయిదు దశలకు సంబంధించి నమోదైన ఓట్ల వివరాలను ఎన్నికల సంఘం విడుదల చేసింది. నియోజకవర్గాల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల గణాంకాలను తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. దేశంలో ఎన్నికల పక్రియకు హాని కలిగించేలా ఒక క్రమపద్ధతిలో తప్పుడు కథనాల వ్యాప్తి, దుర్మార్గపు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈసందర్భంగా ఆరోపించింది. పోలైన ఓట్ల సంఖ్యలో మార్పులు చేయడం అసాధ్యమని మరోసారి స్పష్టంచేసింది. ఓటింగ్ పూర్తయిన 48 గంటల్లోగా ప్రతీ పోలింగ్ కేంద్రం వారీగా ఓటింగ్ శాతాలను ఈసీ వెబ్‌సైట్‌లో ఉంచాలని అభ్యర్థిస్తూ 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)' సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పటికే అయిదు దశల పోలింగ్ ముగిసి.. మరో రెండు దశలు మాత్రమే మిగిలిఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో దీనిపై ఈసీకి ఆదేశాలు జారీ చేయలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రతీ పార్లమెంటు నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకున్నవారి కచ్చితమైన సంఖ్యను వెల్లడించేందుకు 'ఓటర్ టర్నవుట్' డేటా ఫార్మాట్‌ను మరింత విస్తరించాలని నిర్ణయించినట్లు ఈసీ తెలిపింది. మొత్తం ఓటర్ల సంఖ్య,

నమోదైన పోలింగ్ శాతం ద్వారా ఎంతమంది ఓటేశారనేది తెలుసు కోవచ్చని పేర్కొంది. ఈ రెండు వివరాలు ఇప్పటికే ప్రజల వద్ద అందుబాటులో ఉన్నాయని గుర్తు చేసింది.

పోలింగ్ శాతాన్ని విడుదల చేస్తున్న ఈసీ.. నమోదైన ఓట్ల సంఖ్యనూ వెల్లడించాలని డిమాండ్లు వస్తోన్న నేపథ్యంలో ఈమేరకు స్పందించింది.

# డ్రగ్స్ అన్న మాట వినరావద్దు

**హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా చేయాలని భావించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌కు సీఎం హోదాలో తొలిసారి రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లారు. కమాండ్ కంట్రోల్‌లో ఉండే అధికారులు విధులు, ఇతర అంశాలపై సమీక్షిస్తుంచినట్లు తెలుస్తోంది. నార్కోటిక్స్ బ్యూరో పనితీరుపై ఆరా తీసిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణలో డ్రగ్స్ అనే పదం వినిపించకూడదు అని ఆదేశించారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే యువతపై డ్రగ్స్, మత్తు పదార్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. నార్కోటిక్స్ బ్యూరోకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకబడ్జెట్ కేటాయించింది. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకే ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్



వంటి మత్తుపదార్థాలు అరికట్టడంతో పాటు అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో గుర్తించి చర్యలు తీసుకోవడంపై చర్చించారు. ఇటీవల బెంగళూరు శివారులో జరిగిన రేవ్ పార్టీ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. టాలీవుడ్ సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు ఆ పార్టీలో డ్రగ్స్ వినియోగించారని బెంగళూరు పోలీసులు ప్రకటించడంతో ఈ సమీక్షపై ఉత్కంఠ నెలకొంది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి కమాండ్ కంట్రోల్‌కు వచ్చిన ఆయనకు సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి సెక్యూరిటీ వింగ్, డ్రగ్స్ కంట్రోల్ వింగ్‌లను సీఎం పరిశీలించారు. అధికారుల విధుల గురించి తెలుసుకుని, వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నార్కోటిక్స్ బ్యూరోకు బడ్జెట్ కేటాయించిన నేపథ్యంలో దానిపై చర్చించారు. డ్రగ్స్ నిర్మూలనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్లోనే ఇతర విభాగాల అధికారులతోనూ సీఎం సమీక్ష చేపట్టారు. రాబోయే వర్షాకాలానికి సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై చర్చించారు. పోలీస్, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, విద్యుత్, వాతావరణశాఖతో పాటు ఇతర విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# బెంగళూరు రేవ్ పార్టీ కేసు

**బెంగళూరు:** బెంగళూరు రేవ్ పార్టీ కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఘటనపై మొత్తం 8 మందికి ఒకేసారి సీసీబీ పోలీసులు నోటీసులు జారీచేయడం జరిగింది. ఇందులో టాలీవుడ్ నటి హేమ కూడా ఉన్నారు. రక్త నమూనాలలో డ్రగ్స్ తీసుకున్నారని తేలిన వారికి సీసీబీ నోటీసులు జారీచేసింది. సోమవారం ఉదయం 10 గంటలకు బెంగళూరు పోలీసుల ఎదుట హాజరు కావాలని నోటీసుల్లో సీసీబీ స్పష్టంగా పేర్కొన్నది. కాగా.. రేవ్ పార్టీలో పట్టుబడిన 101 మంది బ్లడ్ శాంపిల్స్ పరీక్షలు చేయగా.. 86 మందికి రక్త నమూనాలలో డ్రగ్స్ ఆనవాళ్లు ఉన్నట్లు తేలిన సంగతి తెలిసిందే. ఇందులో 59 మంది పురుషులు, 27 మంది మహిళలు ఉన్నారు. పార్టీలో ఉన్న 30 మందిలో 27 మంది మహిళలు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ కావడం గమనార్హం. డ్రగ్స్ తీసుకున్న వారందరికీ సీసీబీ పోలీసులు నోటీసులు పంపుతున్నారు. పాజిటివ్ వచ్చిన వారందరికీ విడతల వారీగా నోటీసులు ఇవ్వడం జరుగుతోంది. తొలి విడతలో 8 మందికి బెంగళూరు సీసీబీ నోటీసులు జారీ చేసింది.

రేవ్ పార్టీలో పాల్గొన్న తెలుగు వారందరికీ పాజిటివ్ అని తేలింది. పాజిటివ్ వచ్చిన వారిలో నటి హేమతో పాటు ఆషీరాయ్, పార్టీ నిర్వహించిన వాసుతో పాటు పలువురు ఉన్నారు.

అబ్బే.. తాను రేవ్ పార్టీలోకి పోలేదని హైదరాబాద్ ఫామ్‌హౌస్‌లోని ఓ వీడియో.. ఆ మరుసటి రోజు పచ్చడి చేస్తున్నట్లు మరో వీడియో రిలీజ్ చేసింది హేమ. హేమ ఫొటోను బెంగళూరు పోలీసులు రిలీజ్ చేయడం సీన్ మొత్తం రివర్సయ్యింది. కృష్ణవేణి పేరుతో నటి హేమ పార్టీకి హాజరైంది. పోలీసు రికార్డుల్లోనూ హేమ పేరు కృష్ణవేణిగా నమోదు చేయడం జరిగింది. అయితే.. హేమను బాధితురాలిగా పరిగణించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## పదేళ్లలో బిఆర్ఎస్ ఉద్యోగాలు ఇవ్వలేదు

**ఖమ్మం:** పదేళ్లలో భారాస ఉద్యోగాలు కల్పించలేకపోయిందని భాజపా నేత ఈటల రాజేందర్ విమర్శించారు. అలా కల్పించివుంటే ఇవాళ నిరుద్యోగులు ఎందుకు ప్రశ్నిస్తారని అన్నారు. ఉద్యోగాలు కల్పించక పోగా ..ఇచ్చామని చెప్పడం మరింత దారుణమని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇల్లందులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడే ఏమీ చేయని భారాస ఇప్పుడెలా చేస్తుందని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాలు పక్కదారి పట్టాయన్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్లు, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం మాత్రమే అమలవుతోందని చెప్పారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. పట్టభద్రులను చిన్నచూపు చూసిన పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు రావడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు.

# రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వేడి

**వరంగల్ :** రాష్ట్రంలో ఎన్నికల వేడి ఇంకా తగ్గలేదు. సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికతో ఈ తంతు ముగియనుంది. ఆరు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. పది రోజుల క్రితం లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. అయినా తెలంగాణలో ఎన్నికల హడావుడి ఇంకా పోలేదు. సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరగనున్నది. ఇక్కడ పట్టు సాధించి అన్ని వర్గాల్లో తమకే ఆదరణ ఉందని చెప్పుకునేందుకు అన్ని పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. ఎమ్మెల్సీ ప్రచారం ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియనుంది. దీంతో సోమవారం జరిగే పోలింగ్‌లో ఎవరి పక్షాన పట్టభద్రులు నిలుస్తారనే ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. తెలంగాణలో నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఉపఎన్నికల సోమవారం జరగనుంది. అన్ని పార్టీలు పట్టభద్రులను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నాయి. ఆయా పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కూడా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు హోరాహోరీగా తలపడుతున్నారు. అందుకే పేరుకే ఎమ్మెల్సీ ఉపఎన్నిక అయినా అసెంబ్లీ ఎన్నికల స్థాయిలో ప్రచారం, ప్రలోభాలు సాగుతున్నట్టు చర్చ నడుస్తోంది. ఈ స్థానంలో ఎమ్మెల్సీగా ఉన్న బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి పోటీ చేశారు. విజయం సాధించారు. దీంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో ఇక్కడ ఉపఎన్నిక వచ్చింది. ఇప్పుడు ఈ స్థానంలో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ తరఫున ఏనుగల రాకేష్‌రెడ్డి బరిలో ఉన్నారు. రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన తమ స్థానాన్ని దక్కించుకునందుకు బీఆర్ఎస్ శాయశక్తుల పోరాడుతోంది. దీన్ని కైవశం చేసుకొని పట్టభద్రుల్లో కూడా తమకే పట్టు ఉందని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ సీటు దక్కించుకుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెక్ పెట్టవచ్చనే ఆలోచన బీజేపీ ఉంది. ఈ మూడు పార్టీల వ్యూహాలతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక చాలా హీట్ పుట్టిస్తోంది. మూడు పార్టీలు కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రచారం కూడా అదే స్థాయిలో చేస్తున్నాయి. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడగడంతో పాటు ఆత్మీయ సమ్మేళనాలు, ఇతర పేర్లతో విద్యావంతులకు చేరువ అయ్యేందుకు శ్రమించారు. ÷ఖన్మార్ మల్లన తరఫున సీఎం రేవంత్ రెడ్డి, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు విస్తృత ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి

తరఫున కేటీఆర్, హరీష్‌రావు సుడిగాలి పర్యటనలు చేసి తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విద్యావంతులకు విజ్ఞప్తి చేశారు. తప్పుడు

హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి తరఫున రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్ సహా కీలకమైన నేతలంతా ప్రచారం చేశారు. మోదీ పాలన, బీజేపీ విధానాలు మెచ్చి చదువుకున్న వ్యక్తిని చట్టసభలకు పంపించాలని బీజేపీ నేతలు ప్రచారం చేశారు. ఇలా మూడు పార్టీల హోరాహోరీ ప్రచారంతో జరిగే ఒక్క ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కూడా రాజకీయంగా కాక రేపుతోంది.

# పదేళ్లలో 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

**హైదరాబాద్:** కేసీఆర్ హయాంలో 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేశామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ హయాంలో ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగానికి

కూడా కొత్తగా నోటిఫికేషన్ రాలేదని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో భర్తీ చేసిన ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాకు వెల్లడించారు. తెలంగాణ ఏర్పడి ఒక దశాబ్ద కాలం అవుతోంది. ఉపాధి కల్పన రంగంలో తెలంగాణ అనేక విజయాలు సాధించింది. గత పదేండ్లలో ఇప్పటి దాకా కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉపాధి కల్పన తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా జరిగింది లేదు. ఈ దశాబ్ద కాలంలో జరిగిన ఉపాధి కల్పన గురించి తెలంగాణ యువతకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. నీళ్లు, నిధులు నియమకాలు ప్రతిపాదికన తెలంగాణ ఉద్యమం జరిగింది. కేసీఆర్ నాయకత్వంలో సాధించిన ప్రగతి, ఉపాధి కల్పన రంగంలో సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు.

నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యధేచ్ఛగా తెలంగాణకు రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో తీవ్రమైన వివక్ష, అన్యాయం జరిగింది. దాన్ని నిరసిస్తూ ఎన్నో సందర్భాల్లో కేసీఆర్ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా ప్రకటించడాన్ని నిరసిస్తూ కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఉమ్మడి ఏపీలో రాష్ట్రపతి ఉత్తర్వులను యధేచ్ఛగా, ఇష్టానుసారంగా నాటి ప్రభుత్వాలు తుంగలో తొక్కాయి. ఉత్తర్వులను ఉల్లంఘించాయి. జోనల్ సిస్టమ్‌లో ఉన్న ఓపెన్ కోటాను నాన్ లోకల్ కోటాగా అన్వయిస్తూ.. సమైక్య పాలకులు తెలంగాణ యువతకు తీవ్ర అన్యాయం చేశారు అని కేటీఆర్ గుర్తు చేశారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకత్వాన్ని సవాల్ చేస్తున్నాను. అటెండర్ నుంచి గ్రూప్ 1 ఆఫీసర్ దాకా 95 శాతం ఉద్యోగాలు స్థానిక పిల్లలకే ఇచ్చే రాష్ట్రం తెలంగాణ తప్ప మరొకటి ఉన్నదా..? ఒకవేళ ఉంటే తెలంగాణ యువతకు చెప్పాలని బీజేపీ, కాంగ్రెస్ నాయకత్వాన్ని సవాల్ చేస్తున్నా. ఈ రెండు పార్టీలే 75 ఏండ్లు అధికారంలో ఉన్నాయి. 28రాష్ట్రాల్లో ఆయా పార్టీల ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రపతి, ప్రధానిని కలిసి కొత్త జోనల్ వ్యవస్థను తెచ్చాం. అటెండర్ నుంచి గ్రూప్-1 ఆఫీసర్ దాకా తెలంగాణ యువతకే ఉద్యోగాలు దక్కేలా 95 శాతం రిజర్వేషన్లు కల్పించాం. ఈ రిజర్వేషన్లు భారతదేశంలో ఎక్కడా లేవు. ఈ విషయాన్ని తెలంగాణ యువత, వారి తల్లిదండ్రులు గమనించాలి. ఇది కేసీఆర్ వల్లే సాధ్యమైంది. నిరుద్యోగుల బాధ, నియామకాల్లో వివక్ష చూసిన తర్వాత 95 శాతం రిజర్వేషన్లు కేసీఆర్ కల్పించారని కేటీఆర్ పేర్కొన్నారు. 2014 నుంచి 2023 డిసెంబర్ దాకా తొమ్మిదిన్నరేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. మా కంటే ముందు పదేండ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కాంగ్రెస్ హయాంలో 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలోని 23 జిల్లాల్లో మొత్తం కలిపి ఏపీపీఎస్సీ ద్వారా, ఇతర సంస్థల ద్వారా 24,086 ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే భర్తీ అయ్యాయి. అందులో తెలంగాణలో వాటా 42 శాతం అనుకుంటే.. తెలంగాణలోని పది జిల్లాలకు దక్కింది 10,080 ఉద్యోగాలు మాత్రమే అని కేటీఆర్ తెలిపారు.కేసీఆర్ హయాంలో 2 లక్షల 32 వేల 308 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. అందులో 2 లక్షల 2 వేల 735 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశాం.టీఎస్‌పీఎస్సీ ద్వారా 60,918 ఉద్యోగాల భర్తీకి అనుమతిస్తే, 54,015 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయ్యాయి.

# కెసిఆర్, కెటిఆర్ లాంటి వారు వచ్చినా గెలుపును ఆపలేరు


**నల్లగొండ:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కేసీఆర్, కేటీఆర్ లాంటి వాళ్ళు వంద మంది వచ్చినా తన గెలుపును అడ్డుకోలేరని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. ఒంటరిగానే తీన్మార్ మల్లన్న ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడాడని .. కాంగ్రెస్ పార్టీ తనకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందన్నారు. మే 25వ తేదీ శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లతో కాంగ్రెస్ ఎన్నికల ఆత్మీయ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న , జిల్లా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి భారీగా తరలి వచ్చిన ఓటర్లు ... తీన్మార్ మల్లన్నకు ఉద్యోగ,నిరుద్యోగ సంఘాలు మద్దతు పలికారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో



తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమన్నారు. రెండవ స్థానంలో బీజేపీ, బీఆర్ఎస్ ఉండేందుకు ఒకరికొకరు పోటీ పడుతున్నారని చెప్పారు. గత పది సంవత్సరాల్లో ప్రజల పక్షాన పోరాడుతున్నందుకు తనపై పెట్టని కేసులు లేవన్నారు. ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడానని చెప్పారు. ఇప్పుడు కొంతమంది తన ఓటమి కోసం శాయశక్తుల కృషి చేస్తున్నారని అన్నారు. తీన్మార్ మల్లన్న గెలిస్తే మళ్లీ ప్రజల పక్షాన పోరాడుతాడని ... మా బండారాలు బయటపడతాయని కోపంతో కొంతమంది వ్యతిరేకంగా పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రివర్గం,ఎమ్మెల్యేలు, ప్రతిపక్షంలో ఉన్న చాలా మంది తీన్మార్ మల్లన్న ప్రజల మనిషి గెలవాలని కోరుకుంటున్నారని అన్నారు. అందరికంటే ముందుగా గ్రాడ్యుయేట్స్ ఓటర్ల దీవెనలు తనపై

ఉన్నాయన్నారు. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరానని.. మళ్ళీ సొంత పార్టీలోకి వచ్చానని..

దీన్ని కూడా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తీన్మార్ మల్లన్న పై ఎలాంటి ఆరోపణలు చేయాలో తెలియక దిగజారి వ్యక్తిగత విమర్శలు చేయిస్తున్నారని మండిపడ్డారు. తన జీవితం మొత్తం ప్రజాసేవ కోసమే అంకితమని.. ఎక్కడ ప్రజలకు అన్యాయం జరిగినా తీన్మార్ మల్లన్న కొట్లాడుతూనే ఉంటాడని అన్నారు.



# మహిళా మెడికల్ ఆఫీసర్లకు లైంగిక వేధింపులు

**కామారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌పై వేటు**

**కామారెడ్డి:** లైంగిక వేధింపుల కేసులో కామారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌పై సస్పెన్షన్ వేటుపడింది. మహిళా మెడికల్ ఆఫీసర్లను లైంగికంగా వేధించినట్లు తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్యాధికారి తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, లైంగికంగా వేధిస్తున్నాడని కలెక్టర్, ఎస్పీతో పాటు వైద్యశాఖ ఉన్నతాధికారుల కు ఇటీవల 20 మంది మహిళా వైద్యాధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన వైద్యశాఖ విచారణకు కూడా ఆదేశించింది. ఈ క్రమంలో రాష్ట్ర వైద్యాధికారి అమర్ సింగ్ నాయక్ బుధవారం నాడు కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తమను డీఎంహెచ్‌వో ఏ విధంగా ఇబ్బంది పెట్టారన్న విషయాన్ని మహిళా ఉద్యోగులు ఆయనకు వివరించారు. దీంతో లక్ష్మణ్‌సింగ్‌పై వివిధ సెక్షన్ల కింద మొత్తం ఏడు కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళా మెడికల్ ఆఫీసర్లను లక్ష్మణ్ సింగ్ వేధిస్తున్నాడని తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేశారు.



# బీడీ" వేతన ఒప్పందం చర్చలు సఫలం.





**కార్మికులకు వెయ్యి బీడీలకు రూ"4.25 పైసలు పెంపు.**

**బీడీ ప్యాకర్లకు నెలకులకు రూ" 3,650, బట్టి చాటన్, కార్మికులకు రూ"1700 పెరుగుదల.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, మే 25**

బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీలు చుట్టే కార్మికులు, నెలసరి జీతాల ఉద్యోగులు, ప్యాకర్లకు వేతనాల పెంపు కోసం బీడి కంపనీ యాజమాన్యాలతో జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. హైదరాబాదులోని సుచిత్ర ప్రాంతంలో ప్రైవేట్ హొటల్ లో శనివారం బీడీ కార్మిక సంఘాలు, బీడీ యాజమాన్యాల సంఘం మధ్య వేతనాల పెంపుదల సమస్యపై ఉదయం 10 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు చర్చలు జరిగాయి. ఈ చర్చలలో కార్మిక సంఘాల డిమాండ్ మేరకు బీడీలు చుట్టే కార్మికులకు వెయ్యి బీడీలకు ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై అదనంగా రూ"4.25 పైసలు పెంచడానికి, బీడీ ఫ్యాకర్లకు ప్రస్తుతం పొందుతున్న వేతనంపై నెలకి అదనంగా రూ" 3650, నెలసరి జీతాల ఉద్యోగులైన బట్టివాలా, చెన్నీవాలా, బీడీ సాటర్లకు ప్రస్తుతం ఉన్న నెలసరి వేతనాలపై అదనంగా రూ" 1700 పెంచడానికి యాజమాన్యం అంగీకరించింది. పెంచిన వేతనాలను ప్రస్తుత మే నెల నుండే అమలు జరపాలని అగ్రిమెంట్ జరిగింది. నూతన వేతన ఒప్పందం వల్ల రాష్ట్రంలోని బీడి పరిశ్రమలో గల 8 లక్షల మంది కార్మికులకు లబ్ధి



చేకూరనుంది. ప్రస్తుతం జరిగిన వేతన ఒప్పందం రెండు సంవత్సరాల (01.05.2024 నుండి 30.04.2026) వరకు అమలులో ఉంటుంది. ఈ చర్చల్లో బీడీ యజమానుల సంఘం (ది తెలంగాణ బీడీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్) అధ్యక్షులు హితేంద్ర ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర గాంధీ, దేశాయి బీడీ కంపనీ ప్రొడక్షన్ మేనేజర్ రశ్మీ కాంత్ పటేల్, టెలిఫోన్ కంపనీ మేనేజర్ పవన్ బాయి పటేల్, చార్ బాయ్ బీడీ కంపనీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు సిరిగాద సిద్ధిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. ఆంజనేయులు, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్ టియు) రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, శ్రామిక శక్తి బీడి వర్కర్ యూనియన్ (ఎఐఎఫ్ టియు) రాష్ట నాయకులు అనసూయ, వెంకట లక్ష్మీ, బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు) రాష్ట అధ్యక్షులు గోపాల్ స్వామి, రాష్ట కార్యదర్శి యస్. రమ, బియంయస్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సుదీర్, బిఆర్ యస్ బీడీ కార్మిక సంఘం నాయకులు యం.నర్సిములు, ఎచ్ఎంఎస్ బీడీ కార్మిక సంఘం నాయకులు మల్లేశం, ఫెడరేషన్ నాయకులు టీ. బాల్ రాజు, ఎయస్. పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ఇది కార్మికుల విజయం.

**తెలంగాణ బహుళజన బీడీకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు (బిఎల్ టియు) యస్. సిద్దిరాములు**

వేతనాల పెంపు ఒప్పందం కార్మిక సంఘాల ఐక్య పోరాటం వల్ల యాజమాన్యాలు దిగివచ్చి అగ్రిమెంట్ చేయడం జరిగిందని తెలంగాణ బహుళజన బీడీకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు (బిఎల్ టియు) యస్. సిద్దిరాములు అన్నారు. ఇది కార్మికుల విజయం అని అన్నారు. బీడీలు చుట్టే కార్మికులకు వెయ్యి బీడీలకు ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై అదనంగా రూ"4.25 పైసలు, బీడీ ఫ్యాకర్లకు ప్రస్తుతం పొందుతున్న వేతనంపై నెలకి అదనంగా రూ" 3650, నెలసరి జీతాల ఉద్యోగులైన బట్టివాలా, చెన్నీవాలా, బీడీ సాటర్లకు ప్రస్తుతం ఉన్న నెలసరి వేతనాలపై అదనంగా రూ" 1700 పెంచడానికి యాజమాన్యం ఒప్పందం చేసుకుందని వివరించారు. ఈ నెల నుండే అగ్రిమెంట్ అమలు కానుందని తెలిపారు.

# ప్రణాళికతో పరీక్షలకు సిద్ధమైతే విజయం తధ్యం.

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి,మే 25:**





భయం వీడి చక్కటి ప్రణాళికతో పరీక్షలకు సిద్ధమైతే తప్పక విజయం వరిస్తుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభ్యర్థులకు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్ 1,2,3 తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుటకు మూడు మాసాల పాటు శిక్షణ పొందుతున్న (54) మంది ఎస్సి అభ్యర్థులకు కలెక్టర్ స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సిలబస్ ను ఆకళింపు చేసుకొని అందుకనుగుణంగా స్వతహాగా నోట్స్ తయారు చేసుకోవడంతో పాటు కరంట్ అఫైర్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టి పట్టుదలతో సన్నద్ధం కావాలన్నారు. విజయాలు సాధించిన వారి స్ఫూర్తిని, ఇతరుల సహాయాన్ని తీసుకోవాలని, టెస్ట్ సిరీస్ రాస్తూ అనుభవం గడించి పరీక్షలకు హాజరు కావాలన్నారు. లక్షల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నారని, నేను సాధించగలనా అన్న భయం, అనుమానం వీడి ప్రత్యేక దృష్టి పెట్టి సానుకూల దృక్పధంతో చదివితే లక్ష్యం చేరుకోగలుగుతారన్నారు. పరీక్షలు ఎంత క్లిష్టమైన సమర్థవంతగా ఎదుర్కోగలమన్న ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్ళాలన్నారు. సాధించిన ఉద్యోగంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కోవలసి ఉంటుందని, అందుకు సిద్ధంగా ఉండాలని హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సి అభివృద్ధి అధికారి రజిత, సహాయ ఎస్సి అభివృద్ధి అధికారి వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, టిఎన్జీఓ అధ్యక్షులు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండలు



**ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదు**

**వర్షాలు తగ్గుముఖంతో మారిన వాతావరణం**

**హైదరాబాద్:** తెలంగాణలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు..ఎండలు దంచి కొడుతున్నాయి. మళ్లీ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో రాబోయే ఐదురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24గంటల్లో వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది. పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఇక నైరుతి రుతుపవనాలు నైరుతి బంగాళాఖాతంలో మరికొన్ని ప్రాంతాలు, ఆగ్నేయ బంగాళాఖాతంలో మిగతా ప్రాంతాలకు విస్తరించాయని అమరావతి వాతావరణ విభాగం పేర్కొంది. రాబోయే 24గంటల్లో నైరుతి బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల మీదుగా ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. ఈస్ట్ సెంట్రల్ బంగాళాఖాతంపై ఏర్పడిన తీవ్ర అల్పపీడనం గత ఆరుగంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో దాదాపు ఉత్తరం వైపుగా కదులుతోందని.. పేర్కొంది. ఉత్తర వైపు కదులుతూ సాయంత్రం నాటికి తూరు మధ్య కదులుతూ ఆదివారం ఉదయం నాటికి తీవ్ర తుఫానుగా మారి అర్ధరాత్రి సాగర్ ద్వీపం, ఖేపుపరా మధ్య బంగ్లాదేశ్, ఆనుకొని పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని పేర్కొంది.

# శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి.

**తప్పుడు పత్రాలపై విచారణ జరపాలి.**

**అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలి.**

**పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 25:**

జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల ఫేక్ డాక్యుమెంట్స్ పై విచారణ జరపాలని పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ జిల్లా విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం నగరంలో పిడిఎస్ యూ ఆద్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ, నిజామాబాద్ నగరంలో ఉన్నటువంటి శ్రీ చైతన్య, నారాయణ విద్యా సంస్థలు జిల్లా విద్యాశాఖ అధికారులను తప్పుడు డాక్యుమెంట్స్ తో తప్పుదోవ పట్టిస్తున్నారని, విద్యాశాఖ కి ఇచ్చిన ఫీజుల వివరాలలో పదవ తరగతి విద్యార్థులకు 24000 వసూలు చేస్తున్నామని చెప్పి, వాస్తవంగా డేస్ స్కాలర్ రూ" 58000 వసూళ్లు చేస్తున్నారని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు రూ" 108,000 వసూలు చేస్తున్నారని, సరైన విద్యార్హతలు లేని టీచర్స్ తో పాఠాలు చెప్పిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాదు బ్రాంచ్ లకు సంబంధించిన ర్యాంకులను ప్రచారం చేస్తూ, నిజామాబాద్ లో వచ్చాయని అడ్మిషన్లు తీసుకుంటున్నారని, నాసిరకం చదువులు చెబుతూ లక్షల రూపాయలు వివిధ కార్యక్రమాల పేరిట వసూలు చేస్తున్నారని అన్నారు. పాఠ్య పుస్తకాలు ఎండాకాలంలోనే విద్యార్థులకు డోర్ డెలివరీ చేస్తున్నారని, తప్పుడు ఆడిట్ రిపోర్ట్ తయారు చేస్తూ ఆదాయ పన్ను ను ఎగగొడుతున్నారని అన్నారు. మున్సిపాలిటీ, ఫైర్ ఎన్ఓసి లు లేవని, శ్రీ చైతన్య, నారాయణ విద్యా సంస్థల అనుమతి కోసం సమర్పించిన డాక్యుమెంట్స్ లపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నాయకులు వంశీ, సునీల్, ఉదయ్, శశాంక్, రాజు, గోపి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.800 కోట్లు అక్రమంగా వసూలు: బిజెపి

**హైదరాబాద్:** రైసు మిల్లర్లు, బిడ్డర్లతో ప్రభుత్వం చీకటి ఒప్పందం చేసుకుందని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంపై అదనంగా రూ.800 కోట్లు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. నాంపల్లిలోని బీజేపీ స్టేట్ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు.'మిల్లర్లకు ఇచ్చిన 90 రోజుల గడువు దాటినందుకు ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలి. 1.59 లక్షల టన్నుల సన్నబియ్యాన్ని ప్రభుత్వమే బిడ్డర్లకు అమ్మింది. మళ్లీ అధిక ధరకు బిడ్డర్ల నుంచి సన్నబియ్యం కొనడం ఎందుకు? అని ప్రశ్నించారు.




# రైలుకింద పడి ప్రేమజంట ఆత్మహత్య

**వరంగల్:** వరంగల్ రైల్వే స్టేషన్ కు సమీపంలో ఓ ప్రేమజంట రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా సారథి నగర్ కు చెందిన ఐలపోగు సుష్మా (17) అనే యువతి, వరంగల్ కాశిబుగ్గ కు చెందిన చెన్నకేశవ అనే యువకుడు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఏడు మోరీల వద్ద నవజీవన్ ఎక్స్ ప్రెస్ కిందపడి సుష్మా, చెన్నకేశవ ఆత్మహత్యకు పాల్పడ్డారు. యువతి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతడు కూడా చనిపోయినట్టు సమాచారం.

రెండు మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. సుష్మా కనిపించడంలేదని ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. మృతుల కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత ఏ కారణంగా ఆత్మహత్యకు చేసుకున్నరనే విషయాలు బయటకు వస్తాయన్నారు. ఐఒఎం.మల్లయ్య, ఎస్ఐ, ఆర్పీ, వరంగల్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రేమ వ్యవహారానికి పెద్దలు అడ్డుచెప్పడంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# భద్రాచలంలో భారీగా గంజాయి పట్టివేత

**భద్రాచలం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆశ్వారావుపేటలో భారీగా గంజాయి పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. బొలేరో వాహనంలో తరలిస్తున్న 3.30 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బుజ్జి కారును చూసి ముచ్చటపడ్డ నాగచైతన్య



ప్రస్తుతం టాలీవుడ్‌లో ఎక్కడ చూసినా బుజ్జి టాపిక్కే నడుస్తోంది. బుజ్జి అంటే మనిషి కాదు. ప్రభాస్ హీరోగా నటిస్తోన్న కల్కి 2898 ఎడి' చిత్రంలో కీలక పాత్ర పోషించే కారు అది. ఇటీవల 'బుజ్జి'ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ చిత్రం కోసమే ప్రత్యేకంగా ఆ కారును డిజైన్ చేశారు. తాజాగా యంగ్ హీరో నాగచైతన్య బుజ్జిని కలిశారు. బుజ్జిని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసం 'కల్కి' టీమ్ ఓ ఈవెంట్ చేసింది. దానిలో బుజ్జితో పాటు ఎంట్రీ ఇచ్చాడు ప్రభాస్. ఎఫ్ 1 రేసింగ్‌లో ఉపయోగించే కారులాగా ఉన్న బుజ్జిని చూసి చాలామంది ఇంప్రెస్ అయ్యారు. అలా ఇంప్రెస్ అయినవారిలో నాగచైతన్య కూడా ఒకడు. అందుకే బుజ్జిని డైరెక్ట్‌గావెళ్లి చూశారు. బుజ్జితో ఒక రైడ్‌కు వెళ్లాడు. దాని తయారీని చూసి ఆశ్చర్యపోయాడు చైతూ. 'నేను ఇంకా షాక్‌లోనే ఉన్నాను. మీరు ఇంజనీరింగ్‌కు సంబంధించిన అన్ని రూల్స్‌ను బ్రేక్ చేశారు' అంటూ బుజ్జిని తయారు చేసిన టీమ్‌ను ప్రశంసించారు నాగచైతన్య. ఆయన బుజ్జిని కలవడం, దాంతో రైడ్‌కు వెళ్లడాన్ని వీడియోగా తీసి తమ సోషల్ మీడియాలో షేర్ చేసింది వైజయంతీ మూవీస్. మామూలుగా చైతూకు ముందు నుంచి కార్లంటే చాలా ఇష్టం. అందుకే ఏ స్టార్ దగ్గర లేని కొన్ని అడ్వాన్స్ మోడల్ కార్ కలెక్షన్స్ తన దగ్గర ఉన్నాయి. అలాంటి హీరో బుజ్జితో రైడ్‌కు వెళ్లిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

దీన్నిబట్టి చూ?స్త 'కల్కి 2898'ను ప్రమోట్ చేయడానికి మరెందరో తెలుగు స్టార్లు రంగంలోకి దిగుతారని తెలుస్తోంది.

# లవ్‌మీలో దర్శకుడి తడబాటు

సినిమా కథనంలో కానరాని వైవిధ్యం దిల్‌రాజు కుటుంబం నుంచి వచ్చి హీరోగా తెరకు పరిచయమయ్యారు ఆశిష్. తొలి ప్రయత్నంలో 'రౌడీ బాయ్స్'తో మిశ్రమ ఫలితాన్ని అందుకున్న ఆయన.. ఇప్పుడు రెండో ప్రయత్నంలో 'లవ్ మీ'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. 'బేబీ'తో మెప్పించిన వైష్ణవి చైతన్య నాయికగా నటించడం.. టీజర్, ట్రైలర్లకు ఆదరణ దక్కడం.. ప్రేక్షకుల్లో దీనిపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ర్జున్ (ఆశిష్)కు దేవుడు, దెయ్యాలపై అసలు నమ్మకం ఉండదు. ఎక్కడైనా దెయ్యాలున్నాయని తెలిస్తే చాలు అక్కడికి వెళ్లి.. అవి లేవని సాక్ష్యాధారాలతో సహా నిరూపిస్తుంటాడు. ఆ వీడియోలన్నింటినీ తన యూట్యూబ్ ఛానెల్‌లో పెట్టి డబ్బులు సంపాదిస్తుంటాడు. ఈ విషయంలో అతనికి తన సోదరుడు ప్రతాప్ (రవికృష్ణ) కూడా సహాయ పడుతుంటాడు. ఈ క్రమంలో ఓసారి అర్జున్‌కు ప్రతాప్ ప్రియురాలు ప్రియ (వైష్ణవి చైతన్య) ద్వారా దివ్యవతి అనే దెయ్యం గురించి తెలుస్తుంది. తెలంగాణ - కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఓ ఊరిలోని పాడుబడ్డ అపార్ట్‌మెంట్‌లో ఆ దెయ్యం తిరుగుతోందని.. ఆమె గురించి తెలుసుకోవాలని ప్రయత్నించిన చాలా మందిని హతమార్చిందని తెలుసుకుంటాడు. ఆ కథ విన్నాక అర్జున్ ఎలాగైనా ఆ దెయ్యాన్ని తన ప్రేమలో పడేయాలని నిర్ణయించుకుని అక్కడికి వెళ్తాడు. మరి ఆ తర్వాత తనెలాంటి పరిణామాల్ని ఎదుర్కొన్నాడు? దివ్యవతి కథేంటి? ఆమెకు గతంలో కనిపించకుండా పోయిన పల్లవి, నూర్, ఛరిష్మాలకు ఉన్న సంబంధం ఏంటి? అసలు దివ్యవతి కథను అర్జున్ దగ్గరకు ప్రియ ఎందుకు చేర్చింది? అన్నది సినిమా కథ. విభిన్నమైన పాయింట్‌తో తెరకెక్కిన రొమాంటిక్ హారర్ థ్రిల్లర్. ఓ యువకుడు దెయ్యాన్ని ప్రేమలో దింపాలని ప్రయత్నిస్తే ఎలాంటి పరిణామాలెదురయ్యాయన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. ఇలాంటి కథ విషయంలో కొత్త దర్శకుడు అరుణ్ భీమవరపు అనుభవం సరిపోలేదనిపిస్తుంది. తాను రాసుకున్న కథలో కొత్తదనమున్నా.. దాన్ని లాజికల్‌గా ప్రేక్షకులు కన్విన్స్ అయ్యేలా చెప్పడంలో తడబడ్డారు. దీనికి తోడు సినిమాలో ట్విస్ట్‌లా సెట్ చేసి పెట్టుకున్న అమ్మాయిల








మిస్సింగ్ పాయింట్ కథను, ప్రేక్షకుల్ని పూర్తిగా గందరగోళానికి గురి చేసింది. అర్జున్ చిన్నతనంలో తన ఊరిలో జరిగిన ఓ అసాధారణమైన మిస్టరీని చూపిస్తూ కథను ఆరంభించిన తీరు ఆసక్తిరేకె త్తిస్తుంది. ఇక ఆ తర్వాత దెయ్యాలు లేవని నిరూపించడంలో అర్జున్ శక్తిసామర్థ్యాల్ని పరిచయం చేస్తూ ఓ హారర్ ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. కానీ, అదంత థ్రిల్లింగ్‌గా అనిపించదు. అర్జున్ ప్రపంచం.. ప్రతాప్‌తో కలిసి చేసే ప్రయాణం.. ప్రియ పరిచయ సన్నివేశాలు.. అన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. ప్రియ.. దివ్యవతి కథను అర్జున్‌కు పరిచయం చేసినప్పటి నుంచే అసలు కథ మొదలవుతుంది. ఆ దెయ్యాన్ని ప్రేమిస్తానంటూ అర్జున్ ఆమె అపార్టుమెంట్‌కు వెళ్లడం.. ఆరంభంలో అక్కడ తనకు ఎదురయ్యే అనుభవాలు.. అక్కడి ప్రపంచం.. అన్నీ థ్రిల్లింగ్‌గా అనిపిస్తాయి. దీనికి తగ్గట్లుగానే ద్వితీయార్ధంపై అంచనాలు పెంచేలా విరామ సన్నివేశాల్ని తీర్చిదిద్దుకున్న తీరు బాగుంది. దివ్యవతి దెయ్యం కాదు బతికే ఉందని నిరూపించడం కోసం అర్జున్ చేసే అన్వేషణతో ద్వితీయార్ధం ఆసక్తికరంగా మొదలవుతుంది. ఈ క్రమంలోనే కనిపించకుండా పోయిన ముగ్గురు అమ్మాయిల ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. ఇక ప్రియ పాత్రలోని ట్విస్ట్ ఊహలకు అందేదే అయినా అర్జున్ పాత్ర వెనకున్న చిన్న మిస్టరీ కాస్త సర్‌ప్రైజ్‌కు గురి చేస్తుంది. రెండో భాగానికి లీడ్ ఇస్తూ క్లైమాక్స్‌లో సెట్ చేసిన ట్విస్ట్ థ్రిల్లింగ్‌గానే ఉంది. దర్శకుడు అరుణ్ రాసుకున్న కథలో కొత్తదనమున్నా.. దాన్ని అంతే ఆసక్తికరంగా తెరపైకి తీసుకురాలేకపోయాడు. ఫస్టాఫ్‌లో కొంత వరకు కథ అక్కడక్కడే తిరిగిన అనుభూతి కలుగుతుంది. సెకండాఫ్‌లో బాగా కంగాళిగా తయారైంది. ఎం.ఎం.కీరవాణి నేపథ్య సంగీతం సినిమాకి ఆకర్షణ.

## ధనుష్ స్వీయ సినిమా రాయన్



తమిళ నటుడు ధనుష్ ప్రస్తుతం వరుస సినిమాలతో లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే ఈ ఏడాది సంక్రాంతికి 'కెప్టెన్ మిల్లర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకున్న ఈ హీరో ప్రస్తుతం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేరా అనే సినిమా చేస్తున్నాడు. ఇక ఈ సినిమా అనంతరం ధనుష్ తన 50వ సినిమాను ప్రకటించిన విషయం తెలిసిందే. ధనుష్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా పేరు రాయన్. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మటన్ కొట్టు రాయన్‌గా ధనుష్ లుక్ వైరల్ అయ్యింది. ఇక ఇదే సినిమాలో సందీప్ కిషన్‌తో పాటు కాళిదాస్ జయరాం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసిన చిత్రబృందం పీచు మిఠాయి అంటూ రొమాంటిక్ పాటను విడుదల చేసింది. ఇక ఈ పాటలో సందీప్ కిషన్, అపర్ణ బాలమురళి రోమాన్స్ ఆకట్టుకునేలా ఉంది. విజయ్ ప్రకాష్, హరిప్రియ కలిసి పాడిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం, ఎఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, విష్ణువిశాల్, దుషారా విజయన్, సెల్వ రాఘవన్, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## కేన్స్‌లో బాలీవుడ్ సందడి



ఉత్తమనటిగా అనసూయ సేన్‌గుప్తాకు అవార్డుఫ్రాన్స్‌లో 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతోంది. ఈ వేడుకల్లో బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్స్ సందడి చేస్తున్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన డ్రెస్‌లను ధరించి రెడ్ కార్పెట్‌పై యలు పోతున్నారు. మరోవైపు ఈ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో మలయాళీ చిత్రం 'ఆల్ వీ ఇమాజైన్ యాజ్ లైట్' పోటీలో నిలిచింది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఓ భారతీయ చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పోటీలో నిలవడం విశేషం. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ముఖ్య విభాగమైన 'పామ్ డి ఓర్' అవార్డుల కేటగిరీలో ఈ సినిమా పోటీ పడుతున్నది. ఇదిలావుంటే తాజాగా భారతీయ నటి అనసూయ సేన్‌గుప్తా చరిత్ర సృష్టించింది. ఇందులో మరో ముఖ్య విభాగమైన 'అన్ స్టర్గ÷యిన్ రిగార్డ్'కేటగిరీలో ఉత్తమ నటిగా అనసూయ అవార్డు అందుకుంది. 'ది షేమ్‌లెస్ అనే చిత్రానికి ఆమె ఈ అవార్డు అందుకోగా.. ఈ ప్రతిష్ఠాత్మక ఫిల్మ్‌ఫెస్టివల్‌లో అవార్డు గెలిచిన తొలి భారతీయురాలిగా అరుదైన ఘనత సాధించింది.

ఇక 'ది షేమ్‌లెస్ ' చిత్ర విషయానికి వస్తే.. ఈ సినిమాను బల్గేరియన్ దర్శకుడు కాన్‌స్టాంటిన్ బొజనోవ్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంలో అనసూయ 'రేణుక' అనే వేశ్య పాత్ర ను పోషించింది. దేశ రాజధాని ఢిల్లీలో గల ఓ బ్రోతల్ హౌస్‌లో ఉన్న రేణుక అనుకోకుండా అక్కడకు వచ్చిన పోలీసును చంపి పారిపోతుంది.

## దర్శకుడు విజయభాస్కర్ రంగప్రవేశం

### కొడుకు శ్రీకమల్ హీరోగా ఉషాపరిణయం మూవీ




టాలీవుడ్ సీనియర్ దర్శకుడు కే. విజయ్ భాస్కర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'నువ్వే కావాలి', 'మన్మథుడు', 'నువ్వు నాకు నచ్చావ్', 'జై చిరంజీవ' లాంటి ఆల్‌టైమ్ ఫ్యామిలీ బ్లాక్‌బస్టర్‌లను టాలీవుడ్‌కు అందించాడు. ఇక చాలారోజులుగా సినిమాలకు దూరంగా ఉంటున్న విజయ్ భాస్కర్ తన కొడుకు కోసం మళ్ళీ మెగాఫోన్ పట్టాడు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఉషాపరిణయం' లవ్ ఈజ్ బ్యూటిఫుల్ అనేది ఉప శీర్షిక. ఈ సినిమాలో విజయ్ భాస్కర్ కొడుకు శ్రీకమల్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే మూవీకి సంబంధించి ఫస్ట్ లుక్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా టీజర్ వదిలింది.

## జియో చేతికి భగవంత్ కేసరి హిందీవర్షన్



నందమూరి నటసింహం బాలయ్య నటించిన 'భగవంత్ కేసరి' చిత్రం గత ఏడాది దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కాజల్ కథానాయికగా నటించింది. ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల ముఖ్య పాత్రలో నటించింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించాడు. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ విలన్‌గా నటించాడు. ఈ మూవీని సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించగా.. ఈ మూవీ 70 కోట్లకు పైగా షేర్ ని అలాగే 132 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టింది. ఈ సినిమాలో తెలంగాణ యాసలో బాలయ్య చెప్పే డైలాగ్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. థియేటర్స్‌లోనే కాదు ఓటీటీలో కూడా మంచి రేటింగ్‌తో అదరగొట్టింది. తాజాగా ఈ బిగ్గెస్ట్ యాక్షన్ మూవీ హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ రైట్స్‌ను జియో సినిమా సొంతం చేసుకుంది. ప్రస్తుతం హిందీ వెర్షన్ లో స్ట్రీమింగ్ అవుతోంది.

## జిమ్ డ్రెస్‌లో ఫోటోలు ఇష్టం ఉండదు



మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌లో జాన్వీబాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తన తాజా సినిమా 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. తనకు చరిత్ర అంటే ఎంతో ఆసక్తి అని చెప్పిన జాన్వీ.. బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీల గురించి మాట్లాడారు. 'ఈ ఇద్దరి గురించి వినడం, మాట్లాడటం నాకెంతో ఇష్టం. వీళ్లు మన సమాజానికి ఎంతో సాయం చేశారు. ఎంతోమందిలో స్ఫూర్తి నింపారు. అందుకే ఈ ఇద్దరికీ సంబంధించిన ఏ అంశమైనా నాకు ఆసక్తిగానే ఉంటుంది. కులాలపై అంబేద్కర్ దృక్కోణం ముందునుంచీ చాలా కఠినంగానే ఉండేది. కాలక్రమేణా గాంధీ దాన్ని మారుస్తూ వచ్చారు. మన సమాజంలో కుల సమస్య అనేది ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటుంది. కులంపై మూడో వ్యక్తి అభిప్రాయం.. ఆ జీవితాన్ని అనుభవిస్తున్న వారి అభిప్రాయానికి మధ్య చాలా తేడా ఉంటుంది' అని చెప్పారు. ఇదే ఇంటర్వ్యూలో తన ఫొటోల గురించి జాన్వీ మాట్లాడుతూ.. 'సెలబ్రిటీల తాజా ఫొటోల కోసం అభిమానులు ఎప్పుడూ ఎదురుచూస్తుంటారు. అందుకే తారలు కనిపించగానే ఫొటోగ్రాఫర్లు కెమెరాలతో క్లిక్‌మని పిస్తుంటారు. నేను ఈ సినిమా ప్రమోషన్స్ కోసం 25సార్లు విమానంలో ప్రయాణించా.. విమానాశ్రయానికి వెళ్లేసరికే ఫొటోగ్రాఫర్లు సిద్ధంగా ఉంటారు. ఇక సినీతారల కోసం ఫొటోగ్రాఫర్లు ఎదురుచూసే మరో ప్రదేశం జిమ్. జిమ్ బయట సెలబ్రిటీలను చాలామంది ఫొటోలు తీస్తుంటారు. నన్ను అలా తీయొద్దని చాలాసార్లు అభ్యర్థించాను. ఎందుకంటే జిమ్ చేసే సమయంలో బిగుతుగా ఉండే దుస్తులు వేసుకుంటాను. ఆ దుస్తుల్లో తీసిన ఫొటోలు వైరలైతే నాకు అలాంటి డ్రెస్‌లే ఇష్టమని అందరూ భావిస్తారు. అందుకే జిమ్ బయట ఫొటోలు దిగడం నాకు నచ్చదు' అని చెప్పారు.